అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 04 జనవరి 2023

10న కడెం ప్రాజెక్టు నీటి విడుదల

కడెం : కడెం ప్రాజెక్ట్ ద్వారా ఈ నెల 10న ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావు తెలిపారు. మంగళవారం వివిధ మండలాల రైతులతో ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావు మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఎనిమిది రోజులు కాలువ స్టార్ట్, ఏడు రోజులు బంద్ పద్ధతిలో సాగు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, దస్తురాబాద్ ఎంపీపీ ఎస్.కిషన్, కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్, ప్రాజెక్ట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నేడు డివిజన్ స్థాయి సైన్స్‌ఫేర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని గిరిజన సంక్షేమ గిరిజన ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్ స్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సైన్స్‌ఫేర్ నోడల్ అధికారి ఎండి ఖమర్‌హుస్సేన్ తెలిపారు. ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సైన్స్‌ఫేర్‌లో డివిజన్‌లోని 14 ఆశ్రమ పాఠశాలల నుండి 82 అంశాలపై ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఉదయం పది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్ హాజరు కానున్నట్లు తెలిపారు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సైన్స్ ఓత్సాహికులు సందర్శించాలని ఆయన కోరారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే దంపతులు



నవతెలంగాణ-తాంసి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే దంపతులని మాలీ సంఘం కార్యవర్గ సభ్యులు, సర్పంచ్ గజనన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గిరిగాం, కప్పర్ల, గ్రామాల్లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన అణగారిన వర్గాలకు విద్యబోధన చేసి విద్యావంతులను చేయడానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఫలితంగా మహిళలు చదువుకొని అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని అన్నారు. వారి అడుగు జాడల్లో నడిచి మాలీ సంఘం సభ్యుల ఐక్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, సదానందం, పీఏసీఎస్ వైస్ ధనుంజయ్, మాలీ సంఘం సభ్యులు ఉత్తమ్, గంగారాం, ఉమేష్ డోలే, రవి, తులిసిరాం, వార్డుల సభ్యులు ఉన్నారు.

ఇంద్రవెల్లి : అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలేనని డా. బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ మండల అధ్యక్షులు సర్కాలే శివాజీ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో సావిత్రిబాయి పూలే 192 వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రి పూలే ఆనాడు సమాజంలో కొనసాగిన పురుషాధిక్యతపై ఎనలేని పోరాటం చేసిందన్నారు. మహిళలు సైతం ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా హక్కులున్నాయని, పోరాడిన మహిళ సావిత్రి అని కొనియాడారు. మహిళల హక్కుల కోసం, వారి విద్య కోసం నిరంతరం పోరాటం చేసిందన్నారు. స్త్రీల విద్య కోసం పాఠశాలను విద్యను అందించిన మహనీయురాలని పేర్కొన్నారు. నేటి తరం మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకొని, ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దత్త, ఉత్తం, సత్యానంద్, దిలీప్ మొరే, రాజవర్ధన్ పాల్గొన్నారు.



ఉట్నూర్ : మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో, ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో, ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసి, ప్రేమ, అంకితభావం, కర్తవ్య దీక్షలతో ప్రజల మనసును గెలుచుకున్న గొప్ప వ్యక్తి పూలేనని అన్నారు. అణగారిన ప్రజల, దళితుల, స్త్రీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. దేశపు మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బాసర : తొలి ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఆర్జీయూకేటీ ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి డైరెక్టర్ సతీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా విద్యావేత్త సావిత్రిబాయి పూలే దేశంలో గుర్తు పెట్టుకోదగిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు ఆమె సేవలు యావత్ దేశానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ సెల్ కన్వీనర్ పావని, రమాదేవి, అరుణ జ్యోతి, సారిక, స్వప్న, నాగలక్ష్మి, డీన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ జగ్రామ్ అంతర్వేది హాజరయ్యారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సావిత్రిబాపులే మొదటి మహిళా ఉపాధ్యాయునిగా మహిళ లోకానికి విద్యను అందించిన విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. అనంతరం డా.ఎం.నర్సింగ్ రావు, సావిత్రిబాపూలే జీవితంలో జరిగినటువంటి అనేక సంఘటనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి దయాకర్, ఎండీ అష్రఫ్ అలీ, డాక్టర్ ఏ.శ్రీనివాస్, విజయ్ కుమార్, రఘునాథ్, ప్రతాప్ సింగ్, అనిత ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జైపూర్

గొర్రె మేకల వృత్తిదార్ల సంఘం నూతన క్యాలెండర్‌ను విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో సుమన్‌ను సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రేణికుంట్ల ప్రవీణ్, గొర్రె మేకల వృత్తిదార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్, ఉపాధ్యక్షులు బుచ్చన్న, కరీంనగర్ అధ్యక్షులు శ్రీనివాస్, భూపాల్‌పల్లి జిల్లా అధ్యక్షులు రమేశ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘు పాల్గొన్నారు.

మాలీ కులస్తులు ఐక్యత చాటాలి

- ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం
- మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు

నవతెలంగాణ - బెజ్జూర్

మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించే వరకు పోరాటం ఆగదని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సావిత్రీబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మాలీ కులస్తులు ఆంధ్రాలో ఎస్టీ జాబితాలో కొనసాగుతుండగా తెలంగాణలో మాత్రం బీసీలుగా ఉన్నారన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, అందులో మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి దాన్ని



నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు. మాలీలు ఆదివాసులే నని, ఆదివాసులకు అందుతున్న ఫలాలను మాలీలకు అందే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, పోడు భూములకు పట్టాలందించాలని కోరారు. మహిళలకు విద్య



అవసరమని సావిత్రీబాయి పూలే మహిళల విద్యకోసం ఎంతగానో కృషి చేశారని, దాని ఫలితంగానే నేడు మహిళలకు విద్య అందుతోందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె వసంత్‌రావు మాట్లాడుతూ యువత ముందుండి ఈ సభను విజయవంతం చేయడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. మాలీలను ఎస్టీ జాబితాలో చేర్పించే విధంగా ఐకమత్యంగా పోరాటం చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు గాంధీజీ చౌరస్తా నుండి జ్యోతిబాపులే విగ్రహాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతిబాపులే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గులాంగిరి అనే పుస్తకాన్ని విడుదల చేశారు. కృష్ణపెల్లికి చెందిన 5వ తరగతి విద్యార్థిని ప్రసంగం పలువురిని ఆకర్షించింది. కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నగోసె శంకర్, ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్లె నారాయణ, కోశాధికారి నికాడి హన్మంతు, కౌటాల మండల మాజీ ఎంపీపీ నికాడి గంగారాం, మాలీ సంఘం మండలాధ్యక్షుడు ఆదె అశోక్, యువకులు సురేష్, వసంత్, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన పత్తి

నవతెలంగాణ - కౌటాల

ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి బాలుడి ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..చెన్నూరి కైలాశ్-రమా దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వ్యవసాయమే ఆ కుటుంబానికి దిక్కు. పిల్లలను మంచి చదువులు చదివించేందుకు మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదివిస్తున్నారు. తల్లిదండ్రులు ఆరుగాలం కష్టించి పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం అభిషేక్(10), తమ్ముడు, చెల్లితో కలిసి దాగుడుమూతలు ఆడుకుంటూ వెళ్లి ఇంటిలో ఏరి కుప్పపెట్టిన పత్తిలో దాగుండడానికి వెళ్లాడు. తల లోపలికి అనుకుంటూ పోయి ఊపిరాడక చనిపోయాడు. పెద్దవాడైన అభిషేక్ తమ్ముడు, చెల్లికి దొరకకూడదనే ఆలోచనతో పత్తిలో తలపెట్టి లోపలికి వెళ్లాడు. పత్తి అంతా మీద పడిపోయింది. దీంతో ఊపిరి ఆడలేదు. అందులో నుండి లేచే శక్తి లేక అందులోనే ఉండిపోయాడు. అన్న కోసం తమ్ముడు, చెల్లి ఎంత వెతికినా, పిలిచినా పలకలేదు. ఇంటిలోకి వచ్చిచూడగా పత్తిలో తల ఇరుక్కొని కాళ్ల బయట కనిపించాయి. ఆ దృశ్యం చూసి ఇద్దరు పిల్లలు కేకలు వేశారు. అదే సమయంలో ఇంటికొచ్చిన తల్లిదండ్రులు అభిషేక్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం కౌటాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లె రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

11న హైమన్‌డార్ఫ్, బేటీ ఎలిజబెత్ దంపతుల వర్ధంతి



నవతెలంగాణ - జైనూర్

ఈ నెల 11న మండలంలోని మార్లావాయి గ్రామంలో నిర్వహించనున్న ఆదివాసీ ఆత్మీయ బంధువు హైమన్‌డార్ఫ్, బేటీ ఎలిజబెత్ 36వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డార్ఫ్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కనక వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఐటీడీఏ డీడీ మణెమ్మ, గోండ్వాన మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జున్ మాస్టర్, ఆసిఫాబాద్ సహకార సంఘం చైర్మన్ అలీబిన్ హైమద్, ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌తో పాటు జిల్లా నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల ఆత్మ బంధువైన హైమన్‌డార్ఫ్ వర్ధంతికి అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, గ్రామస్తులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, గ్రామపటేల్ కనక కొద్దు, సార్‌మేడి దేవ్‌రావు, కనక చిన్ను, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహుజనుల అభివృద్ధి బీఎస్‌పీతోనే సాధ్యం

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పలు గ్రామాల్లో కొనసాగిన బహుజన రాజ్యాధికార యాత్ర

నవతెలంగాణ - దహెగాం

బహుజనుల అభివృద్ధి బీఎస్‌పీతోనే సాధ్యమవుతుందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇట్యాల, బోర్లకుంట, రాళ్లగూడ, కొత్మీర్, బీబ్రా, ఐనం, చిన్నఐనం, దహెగాం తదితర గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్ర కొనసాగింది. బీబ్రా గ్రామంలోని బుద్ధవిహార్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పాత పోలీస్‌స్టేషన్‌తో పాటు క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి ఐనం, అనంతరం దహెగాం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో



మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో ఒరగబెట్టిన పాలన సరిపోక బీఆర్ఎస్ అంటూ



జాతీయ పార్టీని పెట్టడం హాస్యాస్పదమన్నారు. అడ్డగోలుగా నిధులను దోచుకుంటూ దోపిడీ రాజ్యాన్ని తయారు చేస్తున్నారంని విమర్శించారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రోత్సాహంతో అధికార పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా అవినీతితో నిండిపోయిందన్నారు. బహుజనులకు నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికార పీఠం ఎక్కిన ప్రభుత్వం 8 ఏండ్లుగా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎక్కడ చూసిన ఒక్కరికి కూడా డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని, ధరణి వల్ల భూ సమస్యలు మరింత పెరిగిపోయాయని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఎస్‌పీని ఆశీర్వదించి గెలిపిస్తే బహుజనులు కలలు కన్న రాష్ట్రాన్ని తయారు చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్‌హుస్సేన్, నాయకులు ప్రవీణ్, జ్యోతి, గౌతమ్, దేవిదాస్ పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులు కాపాడుతా

- మంత్రి సత్యవతి రాథోడ



నవతెలంగాణ-జైపూర్

గిరిజన ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి హక్కులను కాపాడుతానని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు. మంగళవారం సింగరేణి ఉద్యోగుల సంక్షేమ సంఘం అసోసియేషన్ క్యాలెండర్‌ను ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిష్టినాతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పంతులు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి బ్యాక్‌లాగ్ పోస్టులను గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేసుకోగలిగామని పేర్కొన్నారు. సింగరేణిలో పెండింగ్ ఖాళీ ఉద్యోగాల్లో 665 బ్యాక్‌లాగ్ పోస్టులు, 350 పీడీఎఫ్ పోస్టులు గిరిజన యువతి యువకులతో భర్తీ చేయడం కోసం గిరిజన ఉద్యోగుల సంఘం ఎంతగానో కృషి చేసిందని గుర్తు చేశారు. గిరిజన ఉద్యోగుల సంఘం సభ్యుల అభ్యర్థనను ఎప్పటికప్పుడు సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్, డైరెక్టర్లతో మాట్లాడి గిరిజనులకు దక్కాల్సిన ఉద్యోగాలు వారికి దక్కేలా కృషి చేశామని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో కూడా గిరిజనులకు దక్కాల్సిన ఉద్యోగాలు గిరిజన నిరుద్యోగులకు దక్కేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తారాచంద్, బి.వెంకట్‌రామ్, జాయింట్ సెక్రెటరి ఉపేందర్, డి.రాజేశ్, దశరథ్, కొత్తగూడెం ఏరియా అధ్యక్షులు వీరన్న పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యే బోధనతో విద్యార్థుల్లో పురోగతి

నవతెలంగాణ-గుడిహత్నూర్

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శనల ద్వారా విద్యాబోధన విద్యార్థుల్లో పురోగతి ఉంటుందని జడ్పిటిసి పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక విద్య తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా టిఎల్ఎం మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పతంగే బ్రహ్మానంద్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో సునీత హాజరయ్యారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ సంధ్యారాణి మాట్లాడుతూ గతంలో విద్యాబోధన చాలా కఠినంగా ఉండేదని, ప్రదర్శనల ద్వారా విద్యాబోధన చేయడం ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమవ్వడమే కాకుండా విషయాలు గుర్తుండిపోతాయని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఈ మేళాలో బోధనకు అవసరమైన ప్రదర్శనలను ప్రదర్శించగా ప్రజాప్రతినిధులు, అధికారులు వాటిని తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాచర్ల నారాయణ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీపాద శ్రీనివాస్, సరోజ, హేంరాజ్ అగర్వాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివాజీ, బీఆర్ఎస్ నాయకుడు జాదవ్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్ టీఎల్ఎం మేళా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీపీ జాజిమొగ్గ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు 128 టీఎల్ఎంలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రాజెక్టులను నాయనిర్ణేతలు పరిశీలించి సబ్జెక్టుల వారీగా ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరిగిందని నోడల్ అధికారి యాదగిరి తెలిపారు. అనంతరం పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి తహసీల్దార్ సరిత, మండల విద్యాధికారి రమేష్‌బాబు, ఎస్ఐ విజయ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేళాలో జిల్లాస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ నోడల్ అధికారులు భానుప్రకాష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల : విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, మండల విద్యాధికారి సోమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నూతన పద్ధతులను అవలంభిస్తూ బోధించాలన్నారు. ఉపాధ్యాయుల బోధన వివరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తయారుచేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగాలంటే అది కేవలం తరగతిగదిలోనే నిర్మాణమవుతుందన్నారు. దానికి ఉపాధ్యాయులు కీలకమన్నారు. ఉపాధ్యాయులు ఉద్యోగాన్నిభారంగా కాకుండా బాధ్యతగా పనిచేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డి.సోమయ్య, నోడల్ అధికారి హన్మంతు, సీఆర్‌పీలు, క్లస్టర్, హెచ్‌ఎంలు నానాజీ, రమేష్‌తో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరాలకు స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని వివిధ ఆసుపత్రులలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరాలకు స్పందన లభించింది. శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 17 మ ందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్, బెల్లంపల్లి వారి సహకారంతో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తామలజిస్టులు వసీ, గోపి పాల్గొన్నారు.

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో 46 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 19 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కడెం

నవతెలంగాణ 2023 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక, సిబ్బంది. అంకిత భావంతో పనిచేసి ప్రజలకు చేరువ చేస్తున్నారని, వాస్తవాలను నిర్భయంగా రాస్తోందని అన్నారు. అలాంటి పత్రికను ఆధారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, దస్తురాబాద్ ఎంపీపీ కిషన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్ పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం విరామ సమయంలో నూతన సంవత్సరం 2023 సందర్భంగా ఎంపీపీ మహిపాల్ రెడ్డి ఛాంబర్‌లో ఎంపీడీఓతో పాటు ఉపాధి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలయజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఎపీఓ లక్ష్మారెడ్డి, టీఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఫ్ఎలు, కార్యాలయ పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలు సావిత్రిబాయి స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్


ఆదిలాబాద్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నేటి మహిళలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్ అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి ఉత్సవాలను సీఐటీయూ ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను విద్యార్థినులు, మహిళలు, యువత ఆదర్శంగా తీసుకొని చదువులోనూ జీవితంలోను ఎదురయ్యే సమస్యలపై పోరాడాలని సూచించారు. సావిత్రిబాయి పూలే మత చాందసవాదులను ఎదుర్కొని ఆడపిల్లలకు చదువు చెప్పిందని గుర్తు చేశారు. దృఢ సంకల్పంతో స్వయంగా మహిళల కోసం పాఠశాలను స్థాపించిందన్నారు. నాటి మత చాందసవాదులు తనను అనేక రకాలుగా అవమానించిన ఇబ్బందులను అధిగమించి దేశంలో మొదటి మహిళ ఆది గురువుగా కీర్తి గడించిందన్నారు. భారత రాజ్యాంగం విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించిన నేపథ్యంలో విద్య అందరికి అందుబాటులోకి వచ్చిందని అన్నారు. మహిళలు చదువుకొని ప్రశ్నించడం, పోరాడటం, ఉద్యోగాలు చేయడం వంటి రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడాలని ఆకాంక్షించారు. అయితే అవి గిట్టని నేటి చాందసభావాలు గల పాలకులు తిరిగి మహిళలను తిరిగి విద్యకు దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే నూతన విద్యా విధానంలో మత భావాలు చొప్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ ప్రమాదాన్ని గుర్తించి, కేంద్ర ప్రభుత్వ కుట్ర పూరిత నిర్ణయాలను వ్యతిరేకించాలని కోరారు. విద్యాహక్కు చట్టం పకడ్బందీ అమలు కోసం, రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, నాయకులు పోచ్చన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల, కే ఆశన్న, ఎన్. స్వామి, కాంతమ్మ, రోజా, రాధ, సలీం పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో..

నవతెలంగాణ-నేరడిగొండ : సావిత్రిబాయి పూలే జయంతిని మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లె సంతోష్ సింగ్ మండల నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసి, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని అన్నారు. అనంతరం రాజుర గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గ్రామ పెద్దలు, పాఠశాల బృందంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి. రాములు, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అనుపట్ల సంజీవ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్. రాజశేఖర్, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి శేఖర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాథోడ్ ఉద్ధల్ సింగ్ కార్యకర్తలు గజ్జల రవి, సత్యం, బ్రహ్మం పాల్గొన్నారు.

తలమడుగు :దేశానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే అని బ్లూ భీమ్ యూత్ అధ్యక్షుడు గొంటిముక్కుల ప్రేమేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192 జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. సావిత్రి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పాఠశాలలో గల మహిళ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు మాట్లాడుతూ భారత దేశపు మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, రచయిత, మహిళ హక్కుల కోసం పోరాడిన యోధురాలు, ఎన్నో కష్టాలను ఎదుర్కొని మహిళ విద్యకు బాటలు వేశారని అన్నారు. బాలల, యువతుల, వితంతుల కోసం కృషి చేశారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆమె జీవిత చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకుని ఆమె కలలు కన్న సమాజం కోసం కృషి చేయాలని అన్నారు.మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ బహదూర్ నర్సింలు అన్నారు. మంగళవారం రుయ్యాడిలో అంబేద్కర్ యువజన సంఘం, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీ హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పద్మాకర్‌రెడ్డి, పాఠశాల చైర్మెన్ నేతుల గంగన్న, యూత్ సభ్యులు సంజీవ్, ఆశన్న, రాములు, జాను దిలీప్, సచిన్, బక్కన్న, వినోద్, రుయ్యాడి గ్రామ సర్పంచ్ పోతారెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చెన్నాల లస్మన్న, స్థానిక మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగాధర్, జువ్వాక నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి, జువ్వాక ఉత్తం, కుమ్మరి శంకర్, సంజీవరెడ్డి, అశోక్, రాజారెడ్డి, గోక దేవారెడ్డి, గోక ప్రకాష్‌రెడ్డి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్:భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్ అన్నారు. మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలపై మడమ తిప్పని పోరాటమే ఆమె ధీరత్వమని సమాజంలో అసమానతలు తొలగించడమే ఆమె లక్ష్యంగా


తలమడుగులో..

పనిచేశారని అన్నారు. అక్షరంతోనే సమాజాన్ని మార్చవచ్చని మహిళ అభ్యున్నతికి పాటు పడ్డారని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు అజ్మీరా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల, మహిళల హక్కులు నిరాకరించబడిన, దేశంలో ఆనాటి కట్టుబాట్లను, సాంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను దిక్కరించిన భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి అని అన్నారు.

సారంగాపూర్ :మండలంలోని నాగపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భారత దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు .ఈ సంధర్బంగా పాఠశాల ఉపాధ్యాయలు గంగారాం, మధుకర్‌లు.. సావిత్రీ బాయి పూలే గురించి విద్యార్థులకు వివరించారు. ఆమె పూణే నగరంలో 1841 జనవరి 1 మహిళల కోసం తొలి మహిళ పాఠశాలను స్థాపించి భారత దేశ చరిత్రలో తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన సంఘం అధ్యక్షులు నర్సింహ పాల్గొన్నారు.

జైనథ్:బాలికల విద్యకు పునాదివేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని జ్యోతిబాపూలే యువజన సంఘం అధ్యక్షుడు చౌదరి పరుశురాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళల ఆశాజ్యోతి, ఆధునిక భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రి బాయి పూలే అని అన్నారు. మహాత్మా జ్యోతి రావ్ పూలే అడుగు జాడల్లో జీవితాంతం నడిచిన గొప్ప సంఘసంస్కర్త అని తెలిపారు. బాలికల కోసం 1848 మొదటి పాఠశాలను ఏర్పాటు చేసి స్త్రీ ఉద్ధరణకు కృషి చేశారని అన్నారు. సర్పంచ్ దేవన్న, కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు పిడుగు స్వామి, మండల బీఎస్పీ అధ్యక్షులు రావుల పొచ్చన్న, రాందాస్, చౌదరి రాజేశ్వర్ పాల్గొన్నారు.


సారంగాపూర్‌లో..

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముథోల్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండల కేంద్రంలోని కొలిగల్లీలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలిగల్లీకి చెందిన భారమొల్ల గణేష్(19) తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం సాయంత్రం పొలానికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మంగళవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా, పొలంలోని చెట్టుకు ఉరేసుకొని చనిపోయిన్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన సింగ్నెవార్ శివలీల(19)పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు స్వంత ఊరు తానూరు మండలం హిప్నెల్లి గ్రామం. 5 నెలల క్రితం ముథోల్ మండలం విట్టోలి గ్రామానికి చెందిన సింగ్నెవార్ సాయినాథ్‌తో వివాహం జరిగింది. అయితే ఈ వివాహం ఇష్టం లేదని పురుగులమందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ



ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తలమద్రి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తలమద్రి గ్రామానికి చెందిన బత్తుల చిన్న రాజు (23) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోయాక యువకుడు ఇంట్లో దూలానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు టీటీసీ పూర్తి చేసి ఉద్యోగానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇంట్లో పెండ్లి సంబంధాలు చూస్తున్నారు. కోరుకున్న సంబంధం కుదురుతుందో లేదోనని మానసిక ఆవేదనతో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్ర పోతున్న సమయంలో ఇంట్లో దూలానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు.

పీఆర్టీయూటీస్ క్యాలెండర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని ముత్నూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను జెడ్పీటీసీ అర్క పుష్పలత మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఆడే ప్రేమ్, ప్రధాన కార్యదర్శి జీ.నాందేవ్, అనిల్ రాథోడ్, జ్ఞానేశ్వర్, విశ్వాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అంధుల ఆశాజ్యోతి లూయి బ్రేయిలీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

అందుల ఆశాజ్యోతి లూయి బ్రేయిలీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు డీడబ్ల్యూఓ మిల్కా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అంద విద్యార్థులు, అంద ఉద్యోగులు, అంద ఉపాధ్యాయులు పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

అర్బాజ్‌ఖాన్ మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జైనథ్



సాత్నాల ప్రాజెక్టులో గల్లంతైన యువకుడు అర్బాజ్ ఖాన్ మృతదేహం మంగళవారం లభ్యమైనట్టు ఏఎస్సై రాథోడ్ ఆత్మారాం నాయక్ తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన అర్బాజ్ ఖాన్ (19) నిన్న ఇంటి బయలుదేరి సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి ముజాయిద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాత్నాల ప్రాజెక్టులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైనట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అనారోగ్యానికి గురై యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన జి.వీకేష్(36) అనారోగ్యం కారణాలతో మనస్తాపం చెంది మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకి పాల్పడ్డాడు. మృతునికి భార్య ఐదు సంవత్సరాలలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బంజారా యువసేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సంజయ్ నాయక్ మంగళవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును పరామర్శించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని పరామర్శించిన వారిలో రాష్ట్ర నాయకులు చవాన్ దయానంద్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి బంజారా సంఘం నాయకులు వెన్నంటి ఉంటారని భరోసా ఇచ్చారు.

6న అఖిల భారతీయ బౌద్ధ ధమ్మ పరిషత్

నవతెలంగాణ-ముథోల్

6న మహారాష్ట్రలోని నాందేడ్ సమీపంలోని దాబాడ్‌లో 36వ అఖిల భారతీయ బౌద్ధ ధమ్మ పరిషత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దానికి సంబంధించిన కరపత్రాలు మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. రెండు రోజులపాటు జరిగే అఖిల భారతీయ బౌద్ధ ధమ్మ పరిషత్‌కు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, మేధావులు హాజరవుతారని తెలిపారు. అఖిల భారతీయ బౌద్ధ పరిషత్‌కు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన బౌద్ధులు, ఉపాసకులు, దళితులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాసకులు ఓని గౌతం, అవినాష్, మహేష్, అజయ్, రుతిక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-సారంగాపూర్

మన ఊరు మన బడిలో భాగంగా రూ.69లక్షలతో చేపట్టనున్న నూతన పాఠశాల భవన నిర్మాణ పనులకు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. మంగళవారం మండలంలోని జామ్ గ్రామంలో మన ఊరు మనబడిలో భాగంగా పాత పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతనంగా నిర్మించుటకు. ఎంపీపీ మహిపాల్ రెడ్డి భూమి పూజచేసి పనులను ప్రారంబించారు. ఈ సంధ్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనులు వేగవంతగా చేసి విద్యార్థులకు భవనాన్ని అందించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమలో అడెల్లి ఆలయ చైర్మెన్ ఆయిటి చందు, ఎంపీటీసీ వనజ, ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, భోజన్న, దినేష్, పీఆర్ ఏఈ శరత్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కృషి అమోఘం

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజల సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కృషి ఆమోగమని ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ పీఓ క్యాంపు కార్యాలయంలో పీఓ వరుణ్ రెడ్డి, నవతెలంగాణ పత్రిక ఉట్నూర్ డివిజన్ ఇన్‌చార్జి దుర్గం గోపీకృష్ణ, ఉట్నూర్ రిపోర్టర్ జాడి అశోక్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులేనని అన్నారు. ప్రజల సమస్యలను వెలికితీసి అధికారుల దృష్టికి తీసుకవచ్చి సమస్యల సాధనకు నిరంతరంగా కృషి చేయాలని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అవినీతిమయం

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రభుత్వం అవినీతిమయంతో కురుకుపోయిందని మాజీ ఎంపీ బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం ప్రజాగోస భరోసా యాత్రలో భాగంగా పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ముందుగా కాలనీలో మహాదేవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్నతో కలిసి ఇంటింటికీ వెళ్లి, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

పుర ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న పుర ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ సూచించారు. పుర ప్రజావాణిలో భాగంగా మంగళవారం స్థానిక పురపాలక కార్యాలయంలో ప్రజల నుండి 31 ఆర్జీలను స్వీకరించారు. పట్టణ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ, కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు అర్జీలు సమర్పించగా చైర్మెన్, కమిషనర్ శైలజతో కలిసి అర్జీలను పరిశీలించారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పుర ప్రజావాణి ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 1.30 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుర పాలక శాఖ మేనేజర్ దివాకర్, మున్సిపల్ రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వెంకటేష్, నితిన్, పట్టణ ప్రణాళిక అధికారులు సాయి కిరణ్, అనురాధ, అధికారులు పెంటయ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేంజర్ల రాజేష్‌పై చర్యలు తీసుకోవాలి

- బైంసా-నిజామాబాద్ రహదారిపై గ్రామస్తుల ఆందోళన
- మద్దతు పలికిన ఆలయ అర్చకులు, అధికారులు



నవతెలంగాణ-బాసర

సోషల్ మీడియాలో బాసర అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేంజర్ల రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని బాసర వ్యాప్తంగా గ్రామస్తులు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. ఆలయానికి చెందిన వ్యాపారస్తులతో పాటు ప్రయివేట్ వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణా సముదాయాలు బంద్ పాటించారు. బైంసా నిజామాబాద్ రహదారిపై స్థానిక రైల్వే స్టేషన్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించి సరస్వతి అమ్మవారి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేంజర్ల రాజేష్ దిష్టి బొమ్మ దహనం చేశారు. గంటపాటు రహదారిపై బైఠాయించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ముథోల్ సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై మహేష్, గ్రామస్తులకు సముదాయించారు. నిరసన విడిచి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు నిరసన విరమించారు. అమ్మవారిని వ్యంగ్య పదాలతో దూషించిన రెంజల్ రాజేష్‌పై పీడీ ఆక్ట్ నమొదు చేయాలని డిమాండ్ చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ తాత్కాలిక లేబర్ సొసైటి సిబ్బంది సైతం అమ్మవారి ఆలయ ప్రధాన గోపురం ముందు ధర్నా నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్ ముందు బైటాయించి, నినాదాలు చేశారు. అనంతరం రెంజల్ రాజేష్‌పై ఆలయ అధికారులు, అర్చకులు ఫిర్యాదు చేశారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా బాసర గ్రామ ప్రజలు శాంతియుతంగా ఆందోళనలో పాల్గొన్నారు. నాగభూషనం స్కూల్ విద్యార్థులు ఆలయ, గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఆలయ ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రేంజర్ల రాజేష్‌పై ఐపీసీ 153, 504 సెక్షన్ల కింద కేసు నమొదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

అడెల్లి ఆలయ సిబ్బందిపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ అడెల్లి మహా పోచమ్మ ఆలయ సిబ్బంది పై చర్యతీసుకోవాలని పవిత్రతను కాపాడాలని అడెల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శేఖర్‌గౌడ్ ఆలయ అవరణలో మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యపు వైఖరికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొందరూ ఉద్యోగులు మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అటువంటివారిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఇకకలోనే ఆలయాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్న స్థానిక ఉద్యోగులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా ఆలయ గోపురం వద్ద టెంటు వేసి ధర్నా నిర్వహిస్తున్న వ్యక్తి వెంటనే అరెస్టు చేయాలని ఆలయ సిబ్బంది స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ధర్నా విరమింపజేసి టెంట్ తొలగించి శేకర్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



గుండి వాగు వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని గుండివాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం గుండి వాగుపై నిర్మిస్తున్న వంతెనను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన సంబంధిత పిల్లర్లను ఎత్తు పెంచి నిర్మించనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకురాగా ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం అయ్యేలోగా వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఈఈ రామ్మోహన్ రావు, డీఈ కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ బి.రాహుల్ మంగళవారం మున్సిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని స్థానిక తారకరామ కాలనీ ఒకటవ వార్డులో తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. ప్రజలు ఎవరైనా ఈ విధానాన్ని పాటించని యెడల వారిపై జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే రాజీవ్ చౌరస్తాలోని కూరగాయల మార్కెట్ వ్యాపారులతో కూరగాయలు అమ్మకం తదుపరి మిగిలిన వ్యర్థాలను మున్సిపల్ వాహనంలో వేయాలని సూచించారు. కార్యక్రమలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యా సాగర్, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట నారాయణ, మేనేజర్ కె.నాగరాజు, కౌన్సిలర్ పొగుల మల్లయ్య పాల్గొన్నారు.

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జిల్లాస్థాయి యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవనంలో జిల్లా క్రీడల అధికారిని మణెమ్మ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబద్ధతతో కృషి చేసినప్పుడు విజయం సాధ్యమవుతుందని యువత ఆదిశగా ప్రయత్నించాలన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ నేటి యువత క్రీడా సాంస్కృతిక రంగాల్లో ముందుండాలన్నారు. ఏకాగ్రతతో కృషిచేసి విజయం సాధించాలన్నారు. దీనికి స్వామి వివేకానంద వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని యువత క్రీడల్లో రాణించడానికి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. స్పోర్ట్స్ ఫెస్టివల్ సందర్భంగా గిరిజన సంస్కృతి ఉట్టి పడేలా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జడ్పీటీసీలు అరిగెల నాగేశ్వరరావు, సంతోష్, ఎంపీపీ మల్లికార్జున్, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ అహమద్, ఏటీడీఓ క్షేత్రయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరించరూ..



నవతెలంగాణ-భీమారం

తాగు నీటి సమస్యల పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆవుడం ఎక్స్‌రోడ్డు వేపలబోడ సమీప కాలనీ మహిళలు కోరుతున్నారు. మంగళవారం నీళ్లు రానీ నల్లా వద్ద ఆ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత 20 రోజుల నుంచి నల్లా నుంచి నీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సమస్య విన్న వించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. మిషన్ భగీరత పైప్‌లైన్ లీకేజీతో టాంక్‌కు సరఫరా అయ్యే లైన్ కట్టేయడంతో సమస్య ఏర్పడిందని, లీకేజీ సమస్యను పరిష్కరించకుండ అధికారులు ఇతర రోడ్డు సాకు చెప్తూ పట్టించుకోకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. వెంటనే సంబందిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందిచుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిగ్రీ స్థాయిలో ప్రతి విద్యార్థి కంప్యూటర్ సాఫ్ట్ స్కిల్స్ అభివద్ధి చేసుకుని నైపుణ్యాలు పెంపొందిచుకోవాలని టాస్క్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివితే మాటలు నదుల్లా ప్రవహిస్తాయని, అవి జీవిత సత్యాన్ని తెలియజేసే స్నేహితుల వంటివని పేర్కొన్నారు. పుస్తకాల అధ్యయనం ద్వారా విజ్ఞానం లభిస్తుందని, పుట్టుక సాధారణమైనా వ్యక్తిగత ఎదుగుదలలో మరణం చరిత్రగా మార్చుకునేందుకు ప్రతీఒక్కరు ఇష్టపడి కష్టపడాలని సూచించారు. టాస్క్ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఈ వెబినార్‌లో భాగంగా మానవ విలువలను అర్థం చేసుకోవడం, సమాజంపై సరైన అవగాహన, చదువుతో పాటు నైపుణ్యాలను జోడించడం, వ్యవస్థాపకత, వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యేఆత్రం సక్కు, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌లు అన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నుకోబడిన ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు జడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే, ఎస్పీలకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, పట్టణ సీఐ రాణా ప్రతాప్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిప్ప సురేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, కోశాధికారి శ్రీధర్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, సతీష్, సురేష్ చారి, తిరుపతిచారి, భాస్కర్ చారి, హన్నన్ రవి, రాధాకృష్ణ చారి, నితేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

చదువుతోనే మహిళ సాధికారత

నవతెలంగాణ-మంచిర్యాల

సమాజంలో మహిళలు చదువుకోవడం వల్లనే సాధికారత సాధ్యమని జిల్లా జడ్జి సత్తయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ బీసీ జాగతి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకొని బెల్లంపల్లి చౌరస్తాలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో సావిత్రిబాయి పూలే అవార్డులను హిళలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జిల్లా ప్రిన్సిపాల్ డిస్టిక్, సెషన్ జడ్జ్ బాతుల సత్తయ్య, జిల్లా సెషన్ మేజిస్ట్రేట్ మైత్రియిలు మాట్లాడుతూ మహిళలను వివిధ రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశంగా చేర్చాలని, ట్యాంక్ బండ్‌పై పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు, భారతరత్న అవార్డును పులే దంపతులకు ప్రకటించాలని తెలంగాణ బీసీ జాగతి నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజన్న వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, నల్ల శంకర్, శ్రీదేవి, అత్తి సరోజ, నగునూరి అర్చన, బీసీ జాగతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూగల మహేష్, లీగల్ అడ్వైజర్ చిట్ల రమేష్, మీడియా కన్వీనర్ సంతోష్ కుమార్ ఆచార్య, జిల్లా నాయకులు నల్ల తీగల మహేష్, పట్టణ అధ్యక్షుడు మడుపు రామ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, బిట్రగుంట రాంబాబు బోయిని హరికృష్ణ పాల్గొన్నారు.



మంచిర్యాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ పెళ్లి, పిల్లలు, ఇంటి చాకిరి, భర్త సేవ తప్ప మరొక లక్ష్యం అనేది స్త్రీకి లభించని కాలంలో చైతన్యపరిచే రచనలు చేస్తూ ఉపాధ్యాయురాలిగా బోధన చేస్తూ, సంఘంలో ఉన్న దురాచారాలను ప్రతిఘటిస్తూ మార్పు కోసం శ్రమించిన సంఘ సంస్కర్త, సహజనశీలి, సావిత్రిబాయి పూలేఅని అన్నారు. వెనకబాటుతనంలో సమాజాన్ని సైతం మార్చడానికి పూలే దంపతులు చేసిన ప్రయత్నం అమోఘమైనది అని అన్నారు.



మంచిర్యాలలో బీసీ జాగృతి ఆధ్వర్యంలో..

జిల్లా పరిషత్ పాఠశాలలో...

భారతదేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలతో నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాడుగుల దుర్గయ్య, ఉపాధ్యాయులు, ఏ.వేణుగోపాల్, గుండేటి యోగేశ్వర్, రేని రాజయ్య, ఇ.మహేష్, శ్రీనివాస వర్మ, గోలి మనోహర్, రంగ, రాణి, భాగ్యలక్ష్మి, నీల్ కమల్ పాల్గొన్నారు.

రామకష్ణాపూర్ : బీసీ సాధన సమితి దళిత హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రి భాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌరస్తాలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మిట్టపెల్లి శ్రీనివాస్, వనం సత్యనారాయణ, దళిత హక్కుల నాయకులు మోతె రాయలింగు, మారపెల్లి రవి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, ఎండీ అక్బర్ అలీ, సీపీఐ నాయకులు ఈరవేని రవీందర్ పాల్గొన్నారు.

జన్నారం : భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటిమల భరత్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు, మామిడిపల్లి ఇందయ్య, కోఆప్షన్ సభ్యులు, సూలువ జనార్ధన్, కోడూరు చంద్రయ్య, శ్రీరాముల గంగాధర్, వెంకటేష్, ప్రశాంత్ దుమల రమేష్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట్ : భారత దేశ మొదటి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి భాయి పూలే అందరికీ ఆదర్శమని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షులు బోనగిరి కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సావిత్రి భాయ్ పూలే 192వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దొంత నర్సయ్య, జిల్లా నాయకులు అవునూరి లచ్చన్న చిప్పకూర్తి నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పెండెం సతీష్, ఉపాధ్యక్షులు శమనపల్లి కిషన్, సత్యనారాయణ, శనిగరపు నరేష్, రాజన్న, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

తాండూర్ : నిరాకరించబడిన స్త్రీ హక్కులను ఆనాటి కట్టుబాట్లను ఎదురించి వారిని చదువుల వైపు నడిపించిన స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని తాండూర్ ఎస్సై సమ్మయ్య అన్నారు. మంగళవారం జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

కెరమెరి : సావిత్రి బాయి పూలే ఆశయసాధనకు కృషి చేయాలని సర్పంచ్ కావుడే తులసిరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనం వద్ద సావిత్రి బాయి పూలే 192 జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గూరే బాలాజీ, వడాయి సుభాష్, నారాయణ, దేవేందర్, కోట్రాంగే నాగేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద జ్యోతిబాపూలే విగ్రహం కు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, బిసి సంఘాల జిల్లా అధ్యక్షులు రూపనార్ రమేష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఆసిఫాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, న్యాయవాదులు రజీ హైదర్, రవీందర్, చంద్రకుమార్, ప్రదీప్ నాయక్, విద్యాసాగర్, వినయ్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొరే కళ్యాణ్, జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. పట్టణంలోని మాతశ్రీ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం అజయ్, జిల్లా నాయకులు శంకర్, పట్టణ నాయకులు భువనేశ్, మారుతి, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

భీమారం : సావిత్రి బాయి పూలే 192వ జయంతిని మండల వ్యాప్తంగా వివిధ సంఘాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.



కాసిపేటలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

కాసిపేట : మండలంలోని దేవాపూర్ బాలిక గిరిజన పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక, నాయకపుగూడ పాఠశాలలో ఆదివాసీ నాయక్పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ముల బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా కార్యదర్శి కొమ్ముల రజిత, సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మద్దినేని చిన్న భీమయ్య, మహేశ్వర్, గొడిసెల బాపు, సురేందర్, కొమ్ముల రజిత పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..



లక్షెట్టిపేటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..



కెరమెరిలో..



జన్నారంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో..

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నవతెలంగాణ-తాండూర్

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మంచి ఉత్తీర్ణత శాతం రాబట్టేందుకు ప్రయత్నించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం తాండూర్ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన తొలిమెట్టు ఎఫ్ఎల్ఎస్ మేళా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల నైపుణ్యతను వెలికి తీసి వారిని భావి భారత పౌరులుగా తీర్చుదిద్దాలన్నారు. విద్యా విధానంలో మార్పు వల్ల సమాజం పురోగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మనబడి ద్వారా పాఠశాలల్లో అత్యాధునిక సౌకర్యాలను సమకూర్చిందని తెలిపారు. సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉపాధ్యాయులు మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని ప్రతి ఉపాధ్యాయుడు వృత్తికి న్యాయం చేస్తూ సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని తెలిపారు. పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల చదువుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తాండూర్ జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు మంచి ఉత్తీర్ణత శాతం రాబట్టి నట్లయితే పాఠశాలకు రూ.లక్ష విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యత, విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. శిథిలమైన పాత స్కూల్ బిల్డింగ్ కలపను వేలం వేయాల్సిందిగా ఆదేశించారు. బేస్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన శిరీష అనే విద్యార్థిని ప్రశంసించారు. ఈ మేళా కార్యక్రమంలోని వివిధ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బోధన



కాసిపేటలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మేళా



అభ్యాసన సామాగ్రిమేళ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ బానయ్య, ఎంఈఓ వాసాల ప్రభాకర్, హెచ్ఎం ప్రేమలత, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో మండల స్థాయి బోధనాభ్యసన మేళా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో నాన్యమైన భోధన జరగాలంటే బోధనాభ్యసన సామాగ్రి తప్పనిసరని అన్నారు. టీఎల్ఎం మేళలో మండలంలో 48 పాఠశాలల నుంచి ఒక్కోపాఠశాల తెలుగు, ఆంగ్లము, గణితం, పరిసరాల విజ్ఞానంపై పాఠశాలకు నాలుగు చొప్పున సుమారు 181 టిఎల్ఎం తీసుకువచ్చి ప్రదర్శించారు. వీటి ఒక్కో విభాగం మొదటి, రెండవ బహుమతి పొందిన బోధనా సామాగ్రిని జిల్లా స్థాయి మేళాలో ప్రదర్శించనున్నారు. కార్యక్రమంలో జక్కు భూమేష్, సర్పంచ్ పొన్కల్, తహసీల్దార్ ఇత్యాల కిషన్, ఎంపీటీసీ హరిణి-మధుసూదన్ రావు, నోడల్ అధికారి దుర్గం చిన్నయ్య, కట్ట రాజమౌళి, కొండు జనార్దన్, దుంపల తిరుపతి, జాడి మురళి పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని ఆశ్రమ పాఠశాల యందు మండలస్థాయి భోదనాబ్యాసన సామాగ్రి మేళ (తొలిమెట్టు) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ తిరుపతిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సబ్జెక్టు వారిగా భోధానోపకరణాలు తయారు చేసి మేళలో ప్రదర్శించారు. కార్యక్రమంలో మండలంలో ఎంపిక చేయబడిన ఉత్తమ బోధనోపకరణాలను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని ఎంఈఓ తెలిపారు. మండల స్థాయిలో ఎన్నిక కాబడిన ఉత్తమ బోధనోపకరణాలు గల పాఠశాలలకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అఫ్జాలుద్దీన్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల నీల్వాయి కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ చంద్రయ్య పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి భోదనాభ్యాసన సామాగ్రి మేళాను నిర్వహించారు. ఈ మేళాను ఎంపీపీ రొడ్డ లక్ష్మీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి మెట్టు ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ఆయా పాఠశాలలకు చెందిన 40 మంది ఉపాధ్యాయులు నాలుగు సబ్జెక్టుల్లో వంద ప్రాజెక్టులు ప్రదర్శనలు చేసి వాటి ప్రాముఖ్యతను, వివరాలను వివరించగా ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కేపల్లి లక్ష్మీ, మాజీ సర్పంచ్ రొడ్డ రమేష్, నాయకులు అక్కేపల్లి బుగ్గ రాజు, మండల నోడల్ ఆఫీసర్ నెన్నల లచ్చయ్య, హెచ్ఎంలు రాథోడ్ రమేష్, లతీఫ్, దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అన్నం రమణారెడ్డి, చిందం చిన్నయ్య సీసీవో రాంబాబు, సీఆర్పీలు తిరుపతి, మంతెన రమేష్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

బ్యాంకు ఇన్సూరెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అబీబ్ అన్నారు. మంగళవారం కేలిబి గ్రామంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందించే ఇన్సూరెన్స్ సేవలపై ప్రజలు చైతన్య వంతులు కావాలన్నారు. అనంతరం ప్రతి ఒక్కరు బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలన్నారు.

జన్నారం : మండలంలోని రోటిగూడ గ్రామపంచాయతీలో మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తపాలాపూర్ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ సేవలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాజాత బృందంచే, పాటలు మ్యాజిక్‌షో నిర్వహించారు. రైతులు తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు సక్రమంగా కట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్కా విజయ లక్ష్మణ్ ఉపసర్పంచ్ భారత సత్యనారాయణ పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో వరస దొంగతనాలకు పాల్పడుతున్న షేక్ మొహమ్మద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని స్థానిక ఎస్సై సతీష్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీలో ఓ వ్యక్తి ఇంట్లో మొహమ్మద్ ఇటీవల రూ.1.37 లక్షల సొత్తు దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దొంగలించిన సొమ్ము అయిపోగా, నల్లపూసల తాడును అమ్మే ప్రయత్నంలో తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండుకు పంపామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు భాస్కర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు కొత్త సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ - జైనూర్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు మంగళవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరంలో జిల్లా, నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నేతకాని రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, ఎంపీటీసీ ఫోరం మండలాధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, ఉషేగావ్ సర్పంచ్ ఉయిక రమాకాంత్ ఉన్నారు.



పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలాధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, జాఫర్, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు నాగేష్, కళావతి, భారతి పాల్గొన్నారు.



విద్యా బోధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ -కెరమెరి

విద్యా భోదనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి టిఎల్ఎం మేళాలో ముఖ్యాథితిగా పాల్గొని మాట్లాడారు. టిఎల్ఎం వినూత్న భోదన పద్ధతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. అనంతరం మండలంలోని 52 పాఠశాలల ఉపాధ్యాయులు టిఎల్ఎం బోధనపై వివరించారు. టిఎల్ఎం బోధనలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు అదనపు కలెక్టర్ బాహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సెడ్మకి ద్రుపతబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, ఉప సర్పంచ్ నిసార్ దేశ్ ముఖ్, ప్రత్యేకాధికారి ఆడే ప్రకాష్, సర్పంచ్ రాథోడ్ బయనబాయి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

ఈ నెల 6న స్కీం వర్కర్లు దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లూరు గ్రామంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్ల ప్రయివేటీకరణను ఆపాలని, బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 6న దేశవ్యాప్తంగా నిరసన దినంగా జరుపుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల అమలు కోసం స్కీం వర్కర్లు పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందకున్నా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. నిరసనలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం, ఉపాధిహామీ, ఐకేపీ తదితర 72 స్కీంలలో పనిచేస్తున్న వారందరు నిరసన కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. ఈ నెల 6న మండల కేంద్రంలోని రైతువేదికలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ చంద్రశేఖర్, ఆశా వర్కర్ సంగీత, మిషన్ భగీరథ కార్మికుడు సురేందర్, భవన నిర్మాణ కార్మికుడు రవి పాల్గొన్నారు.

విప్ బాల్క సుమన్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సమ్మక్క, సారలమ్మ మహిళా సంఘం భవన నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా రూ.18 లక్షలు విడుదలకు కృషి చేసిన సుమన్‌కు శివ్వారం సర్పంచ్ ఆవిడపు గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు. సుమన్‌ను కలిసిన వారిలో కానుకూర్, పౌనూర్ సర్పంచులు వెంకటేశ్వర్‌గౌడ్, సారయ్య, నాయకులు గడ్డం ప్రసాద్ ఉన్నారు.

ఆర్‌కె-1ఏ గనిపై నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్‌కె-1ఏ గనిపై నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి జిఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ రాందాస్ సేఫ్టీ ఆఫీసర్ ఓదెలు పాల్గొని కేక్ కట్ చేసి కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ 2023 కొత్త సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని తీసుకురావాలని, జీరో హమ్ దిశగా పని చేయాలని, ప్రతి ఒక్క కార్మికుని కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీధర్‌రావు, ఏస్ఓ జయంత్ కుమార్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, ఇంజనీర్ సతీష్, సర్వేయర్ నజీర్, షిఫ్ట్ అండర్ మేనేజర్ రవి, సంక్షేమ అధికారి జె.శ్రీనివాస్, టిబిజికెఎస్ ఫిట్ సెక్రటరీ బండారి భిక్షపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సురమల్ల వినయ్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

దేశంలో మొట్టమొదటి చదువుల తల్లి సావిత్రీబాయి పూలే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం తన జీవితాన్నే త్యాగం చేసి కులమతాలకు అతీతంగా విద్యను అందరికి అందించారని, ఆమెను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే 192వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ దేశంలో బాలికల పాఠశాలను తన సహచరి ఫాతిమాషేక్‌తో కలిసి ప్రారంభించి సనాతన సాంప్రదాయవాదుల అవమానాలను, అవహేళనను భరించి జ్ఞాన వెలుగులను పంచిన మహా సంఘ సంస్కర్త అని కొనియాడారు. తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కరుణామయి సావిత్రీబాయి పూలే మరాఠ సాహిత్యంలో తొలితర రచయిత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, ఎంపీటీసీ సోహెల్ హైమద్, మాలీ సంఘం నాయకులు నానాజీ, రవి, మారుతి పలువురు మహిళలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : జ్యోతిబాపూలే సావిత్రిబాయి 192వ జయంతి వేడుకలను వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోసిని గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందాడి సుధాకర్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతికుమారి మాట్లాడుతూ నాటి సమాజంలో దురాచారాలను ప్రతిఘటించి బాలికలకు విద్యను అందించాలనే లక్ష్యంతో పోరాడిన మహిళ సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ లలిత, మండల బాధ్యులు పద్మ రజిత, కళాశాల ప్రిన్సిపాల్ రమ్యకృష్ణ ఉపాధ్యాయులు రజిత పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంలో మాలీ సంఘం భవనంలో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు, మండల అధ్యక్షుడు నికాడి గంగారాం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని అన్నారు. ఆమె అడుగుజాడల్లో మనమందరం నడవాలని, ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మొత్తంపేట సర్పంచ్ ఆదె శ్రీనివాస్, మాలీ సంఘం నాయకులు శ్రీకాంత్, పాండురంగ్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో మాలీ సంఘం నాయకులు బాపురావు, నారాయణ, మెంగాజీ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలీ సంఘం నాయకులు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. ఆమె ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. మండలంలోని తమేళ, కన్నర్‌గావ్, కిర్డీ, కోమటిగూడ తదితర గ్రామాల్లో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ తుకారాం, మాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జైనూర్ : సావిత్రీబాయిపూలే మహిళలకే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలిచారని సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేశంలోనే తొలి విద్యావంతురాలు సావిత్రీబాయి పూలే అని గుర్తు చేశారు. అప్పటి కాలంలో ఆమె చేసిన సేవలు నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం మండలాధ్యక్షుడు ఒసెన్ పెట్కులే, బీఆర్ఎస్ నాయకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

జైపూర్ : తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ ఫలాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గోదరి రమాదేవి లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవింద్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సావిత్రిబాయి పూలే 192వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ కలిగివుండి, చదువుల్లో రాణించాలని, విద్యార్థి దశ నుండి బంగారు భవిష్యత్తుకు తరగతి గదుల నుండే బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లింగస్వామి, నాయకులు ఆసంపల్లి రాజమల్లు, సంఘ సంస్కర్తలు నయీమ్, కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో..



కౌటాలలో..

సింగరేణి ఆల్‌టైమ్ రికార్డు

- డిసెంబర్‌లో 67.3లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- గతేడాదితో పోల్చితే 19 శాతం వృద్ధి
- రోజుకు 2.18 లక్షల టన్నుల బొగ్గు రవాణా
- సీఎండీ ఎన్.శ్రీధర్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి ఆల్ టైమ్ రికార్డు సాధించిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నెలలో అత్యధికంగా నెలవారి ఉత్పత్తి 67.3 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. సింగరేణి డైరెక్టర్లు, అడ్వైజర్లు, సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లతో మంగళవారం హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ సాధిస్తున్న ప్రగతి వివరించారు. 2021 డిసెంబర్‌లో 56.5 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి సాధించగా 2022 డిసెంబర్ నెలలో 67.3 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 19 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 2021 డిసెంబర్‌లో 37.37 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించగా 2022 డిసెంబర్‌లో 24.47 శాతం వృద్ధితో 47 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 80 రోజులు మిగిలి ఉండగా కనీసం రోజుకు 2లక్షల30వేల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి రవాణా జరపాలని సూచించారు. ఈ క్రమంలో రూ.34వేల కోట్లకు పైబడిన టర్నోవర్, అత్యధిక లాభాలు అర్జించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మణుగూరు, కొత్తగూడెం, రామగుండం రీజియన్, ఆడ్రియాల ప్రాజెక్టుల నుండి గరిష్ట స్థాయిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపడం సంతోషమని పేర్కొన్నారు. అన్ని ఏరియాలు ఇదే ఒరవడితో ముందుకు సాగాలని పేర్కొన్నారు.

ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లో జరిగేలా చూడాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించే విధంగా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆసుపత్రిలోని సాధారణ ప్రసవాల గది, వివిధ వార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలోని అత్యధికంగా ప్రసవాలు జరగడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకోసం గర్భిణులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రసవాలు ఖర్చుతో కూడుకొన్నవని, సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని అవసరం మేరకు గర్భిణులకు సిజేరియన్ చేయడం, తల్లి బిడ్డలు క్షేమంగా ఉండడంలో వైద్యుల కృషి అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సోమవారం ప్రసవాలు చేసిన వైద్యులు, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి సుధాకర్ నాయక్, జెడ్పిటిసి నాగేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





పీఎంకేవీవై ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవివై) ఆధ్వర్యంలో కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ కాల్ సెంటర్ కోర్సులకై ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు కేంద్ర నిర్వాహకులు శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని పీఎంకేవీవై కార్యాలయంలో జనవరి 5వ తేదీ లోపు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9381121407 నెంబరును సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలో శ్రీరామ్ నగర్‌కి చెందిన కార్యకర్త కళావతి తండ్రి భూమన్న, అంబేద్కర్ నగర్‌కు చెందిన రాజనర్సు కొద్దీ రోజుల కింద మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రేఖా నాయక్ బాధిత కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లి వారిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-నార్నూర్

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం సాధ్యమని ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రజా ప్రతినిధులు ఉపాధ్యాయులతో కలిసి 2023 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి పీఆర్టీయూ నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరామ్, పీఏసీఎస్ చైర్మెన్ సురేష్ ఆడే, ఎంఈఓ రాపెల్లి ఆశన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్యనారాయణ గౌడ్, రాథోడ్ సుధాకర్, అశ్విన్ కుమార్, శ్రీనివాస్, దిగాంబర్, రాజ్ కుమార్, హరిచంద్ ఉన్నారు.

వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత వహించాలని సర్పంచ్ ముత్యంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వృద్ధులకు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాళిక వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు సమయాని మందులు వేసుకోవాలని అన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజ్ పాల్గొన్నారు.

నేడు ఆశ్రమ పాఠశాలలో సైన్స్‌ఫేర్

నవతెలంగాణ - జైనూర్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో బుధవారం మండల కేంద్రంలో సైన్స్‌ఫేర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండారి సోనేరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిలో ఉన్న నైపుణ్యాన్ని బాహ్య ప్రపంచానికి చూపించడానికే ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు సైన్స్‌ఫేర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు భారీ ఎత్తున హాజరవుతున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, డీడీ మణెమ్మ, ఏటీడీఓతో పాటు విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత ఎంసెట్ శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులకు జనవరి 2 నుండి ఉచిత ఎంసెట్ శిక్షణ ప్రారంభించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్మీడియేట్ ఆర్గనైజింగ్ ప్రకారం ఫిబ్రవరి 6 వ తేదీ నుంచి పూర్వ-వార్షిక పరీక్షలు, 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ లోగా ప్రిన్సిపాళ్లు, సైన్స్ అధ్యాపకులు విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. సైన్స్ రెండవ సంవత్సరం విద్యార్థులకు ఉచిత ఎంసెట్ శిక్షణకు విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో "స్కీనింగ్ టెస్ట్" నిర్వహిస్తారన్నారు. మెరుగైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

భద్రత ఏర్పాట్ల మధ్య ఈవీఎం యంత్రాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఈవీఎం యంత్రాలను భద్రపర్చినట్టు ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ ఈసీఎల్ నుండి వచ్చిన 1 వేయి 57 బ్యాలటింగ్ యూనిట్లు, 825 కంట్రోల్ యూనిట్లను స్కాన్ చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి భద్రపరచడం జరిగిందని తెలిపారు. ఈవీఎం యంత్రాల భద్రత విషయంలో సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, డీటీలు జితేందర్, పోచయ్య రవీందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-వేమనపల్లి

నవతెలంగాణ-2023 నూతన క్యాలెండర్‌ను మంగళవారం వేమనపల్లి తహసీల్దార్ రాజ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో నవతెలంగాణ పత్రికకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. పత్రికలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. సమాజంలో ఉన్న మంచి చెడులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడానికి పత్రికలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సంతోష్ కుమార్, నవతెలంగాణ విలేకరి ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ దేవేందర్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు.